సాక్షి బాపట్ల

బుధవారం । 31 । జూలై । 2024



పార్వతీ అమ్మవారికి సారె సమర్పణ

నరసరావుపేట ఈస్ట్: పాతూరులోని గంగా పార్వతీ సమేత భీమలింగేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ అమ్మవారికి మంగళవారం భక్తులు సారె సమర్పించారు.



వైభవంగా కుమారస్వామి కల్యాణం

తెనాలిఅర్బన్: కుమారస్వామి జన్మదినం సందర్భంగా గంగానమ్మపేటలోని పాత శివాలయంలో మంగళవారం స్వామివారికి కల్యాణం, విశేష అభిషేకాలు నిర్వహించారు.

సుబ్రహ్మణ్యేశ్వరునికి విశేష పూజలు



అమరావతి: అమరావతి అమరేశ్వరాలయంలో సుబ్రహ్మణ్యేశ్వర ఆడికృత్తిక సందర్భంగా సుబ్రహ్మణ్యస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రైలేమో దూరం.. బస్సేమో భారం!

- రైళ్లు లేక ప్రయాణికుల అవస్థలు
- బాపట్ల కేంద్రంగా ఇప్పటికే 10 రద్దు
- 5వ తేదీ నుంచి మరో 3 కూడా..
- ఇంకో మూడు రైళ్లు దారి మళ్లింపు
- జిల్లా కేంద్రంలోనూ ప్రజలకు పాట్లు
- బస్సుల్లో సీట్లు కూడా దొరక్క కష్టాలు
- ఛార్జీల భారంతో మరిన్ని ఇబ్బందులు
- ప్రభుత్వ తీరుపై సర్వత్రా ఆగ్రహం



పేద, మధ్యతరగతి వారికే కాదు.. కాస్తో కూస్తో ఉన్నవారికైనా రైళ్లలో ప్రయాణమంటే కాస్త ఊరట. ఇటు ఛార్జీల భారం తక్కువ కావడంతోపాటు రైలులో సౌకర్యాలు బాగా ఉంటాయని ఎక్కువ మంది వీటిలో ప్రయాణానికి ప్రాధాన్యమిస్తుంటారు. అలాంటి పరిస్థితి నుంచి రైలు ప్రయాణమంటేనే భయపడే దుస్థితికి ఇటు పాలకులు, అటు అధికారులు తీసుకొచ్చారనే విమర్శలు తీవ్రస్థాయిలో వస్తున్నాయి. కొత్త సర్వీసుల సంగతే మోగానీ ఉన్న రైళ్లనూ దూరం చేస్తున్నారు. సర్దుకుని సాధారణ బోగీలో వెళ్దామంటే కాలు పెట్టడానికి కూడా చోటు దొరకని దుస్థితి. ఇక బస్సులే దిక్కని వెళ్లిన ప్రయాణికులకు అక్కడా అదే పరిస్థితి ఎదురవుతోంది. రద్దీతో సీట్లు కూడా దొరకడం లేదు. గంటల తరబడి ప్రయాణంతోపాటు ఛార్జీల భారం కూడా తడిసి మోపడవుతోంది.

బాపట్ల టౌన్ : నూతనంగా ఏర్పడిన బాపట్ల జిల్లా కేంద్రంలో మరిన్ని రైళ్లకు హాల్టింగ్ సదుపాయం కల్పిస్తారని అందరూ భావించారు. ఆ సంగతేమోగానీ ఉన్న సర్వీసులను కూడా రద్దు చేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా కేంద్రమైన బాపట్లకు వివిధ ప్రాంతాల నుంచి ఉద్యోగుల రాకపోకలు పెరిగాయి. సగటున రోజుకు బాపట్ల రైల్వేస్టేషన్‌కు సుమారు 200 – 300 మంది వరకు ఉద్యోగులు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రస్తుతం ప్యాసింజర్ రైళ్ల రద్దు, ఉన్న ఎక్స్‌ప్రెస్ సర్వీసులు సకాలంలో రాకపోవడంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

5వ తేదీ నుంచి పలు రైళ్లు రద్దు

బాపట్ల జిల్లా కేంద్రంగా రాకపోకలు సాగించే 10 రైళ్లు ఇప్పటికే రద్దు అయ్యాయి. వీటితోపాటు ఆగస్టు 5 నుంచి 10వ తేదీ వరకు మరికొన్నింటిని రద్దు చేస్తూ రైల్వేశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వాటిల్లో విజయవాడ నుంచి చెన్నై సెంట్రల్‌కు నడిచే నెంబరు 12711 గల పినాకిని ఎక్స్‌ప్రెస్, విశాఖపట్టణం నుంచి కడప మధ్య నెంబరు 17488 తిరుమల ఎక్స్‌ప్రెస్, కడప నుంచి విశాఖపట్టణం వెళ్లే తిరుమల ఎక్స్‌ప్రెస్ నెంబరు 17487 రైలు (ఆగస్టు 7 నుంచి 12వ తేదీ వరకు) రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. వీటితోపాటు ఆదిలాబాద్ – తిరుపతి (17406 – కృష్ణా ఎక్స్‌ప్రెస్), సికింద్రాబాద్ – గూడూరు (12710 – సింహపురి ఎక్స్‌ప్రెస్) రైళ్లు గతంలో వరంగల్, ఖమ్మం, విజయవాడ మీదుగా బాపట్ల చేరుకునేవి. ఆగస్టు 5వ తేదీ నుంచి సికింద్రాబాద్ నుంచి పిడుగురాళ్ళ, సత్తెనపల్లి, గుంటూరు మీదుగా దారి మళ్లించనున్నారు. దీంతో ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బాపట్ల రైల్వేస్టేషన్

రద్దు చేసిన 10 సర్వీసులు ఇవీ..

బాపట్ల నుంచి విజయవాడ వైపు..

రైలు నెంబర్	వెళ్లే రూటు	సమయం
07458	గుడూరు - విజయవాడ	ఉ. 10.40
07977	బిట్రగుంట - విజయవాడ	ఉ. 7.00
17249	తిరుపతి - కాకినాడ	ఉ. 4.30
07576	ఒంగోలు - విజయవాడ	సా. 4.00
17259	గూడూరు - విజయవాడ	సా. 5.44

బాపట్ల నుంచి గూడూరు వైపు

07461	విజయవాడ - ఒంగోలు	ఉ. 9.24
17260	విజయవాడ - గూడూరు	ఉ. 6.24
07978	విజయవాడ - బిట్రగుంట	సా. 3.18
07500	విజయవాడ - గూడూరు	సా. 6.18
17250	కాకినాడ - తిరుపతి	రా. 9.20

(గమనిక: ఉ.- ఉదయం, సా.- సాయంత్రం, రా.-రాత్రి)



భారీగా వెయిటింగ్ జాబితాలు...

బాపట్ల నుంచి సుదూర ప్రాంతాలకు రిజర్వేషన్లకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోవడంతో ప్రయాణికులు బస్సులను ఆశ్రయిస్తున్నారు. ఒక్కరోజు ముందు తత్కాల్‌లోనైనా టిక్కెట్ కొనుగోలుకు ప్రయత్నిస్తే ఫలితం లేకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు. ఉదయం 8 గంటలకు ఓపెన్ అయ్యే తత్కాల్ కోసం రాత్రి 12 గంటల నుంచే క్యూలో నిలిచినా ఫలితం ఉండటం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. రూ.వేలు వెచ్చించి ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాల్సిన పరిస్థితిపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోజంతా రైల్వేస్టేషన్‌లోనే..



నెల్లూరు నుంచి బాపట్ల మండలం, ముత్తాయపాలెంలోని బంధువుల ఇంటికి వచ్చా. తిరిగి వెళ్లేందుకు మంగళవారం ఉదయం 10 గంటలకు బాపట్ల స్టేషన్‌కు వచ్చినా సాయంత్రం 3 గంటల వరకు ఒక్క రైలు మాత్రమే వచ్చింది. ప్రయత్నించినా ఎక్కలేకపోయా. సాయంత్రం వరకు వేచి ఉన్నా రైలు లేక బంధువుల ఇంటికి వెళ్తున్నా.

– గొల్లపోతు వెంకటస్వామి, కరేడు, నెల్లూరు జిల్లా

నిలబడాల్సిన దుస్థితి



మాది ప్రకాశం జిల్లా, కొత్తపట్నం. కుమార్తె ఊరు బాపట్ల మండలం, రామానగర్ . గతంలో తెల్లవారుజామున 5.30 గంటలకు బిట్రగుంట– విజయవాడ ప్యాసింజర్ ఎక్కి ఉదయం 7 గంటలకు బాపట్లలో దిగేదానిని. మళ్లీ విజయవాడ – ఒంగోలు ప్యాసింజర్ ఎక్కి మధ్యాహ్నం 12.30 గంటలకు ఒంగోలు చేరుకునేవాళ్లం. ప్రస్తుతం ప్యాసింజర్ రద్దుతో ఎక్స్‌ప్రెస్‌లో నిలబడాల్సి వస్తోంది.

– సింగోతి సోవమ్మ, కొత్తపట్నం

ఆలస్యమవుతోంది



బాపట్ల నుంచి విజయవాడ, ఒంగోలు ప్రయాణం అంటే గతంలో గంటలో చేరుకునేవాళ్లం. ఇప్పుడు బస్సులలో మూడు, నాలుగు గంటలు పడుతోంది. కళాశాలలకు వెళ్లే విద్యార్థులకు, ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులకు రైలు సర్వీసులు అందుబాటులో లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందిగా ఉంటోంది. కళాశాలల్లో చాలా క్లాసులు మిస్ కావాల్సి వస్తోంది.

– పిన్నిబోయిన రమేష్, పిన్నిబోయినవారిపాలెం

న్యూస్‌రీల్

ప్రకాశం జిల్లా అండర్-19 క్రికెట్ జట్టు ఎంపిక



మేదరమెట్ల: ఉమ్మడి ప్రకాశం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొరిశపాడు మండలంలోని రావినూతల ఆర్‌ఎస్‌సీఏ గ్రౌండ్‌లో 15 మంది సభ్యులతో అండర్ 19 క్రికెట్ జట్టును మంగళవారం ఎంపిక చేశారు. ఈ నెల 28వ తేదీ నుంచి నిర్వహించిన పోటీల ఆధారంగా విశేష ప్రతిభ కనబరిచిన 15 మంది సభ్యులను జట్టుకు ఎంపిక చేసినట్లు కోచ్ వంశీ తెలిపారు. జట్టు ఎంపికకు ముఖ్య అతిథిగా హాజరైన ఉమ్మడి ప్రకాశం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ బి.జవహర్ మాట్లాడుతూ.. రాజకీయాల ప్రమేయం లేకుండా కేవలం ఆటలో ప్రతిభ చాటిన వారినే ఎంపిక చేశామన్నారు. పేద క్రీడాకారులకు అసోసియేషన్ అండగా ఉంటుందని చెప్పారు. ఆగస్టు ఒకటో తేదీ నుంచి మంగళగిరి, నరసరావుపేట, పేరేచర్లలో నిర్వహించే పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుందని తెలిపారు. ప్రకాశం జిల్లాకు క్రికెట్‌లో గతంలో ఎంతో గుర్తింపు ఉందని, అదే స్థాయిలో ఈ జట్టు రాణించి తిరిగి రాష్ట్రంలో మంచి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. కె.సాత్విక్, ఆనంద్‌జోష్య, విష్ణుదత్త, జయంత్, అఖిల్, నందకిషోర్, మనీష్, గిరీష్, సంతోష్, అభిలాష్, అక్షయ్, మోహన్‌సాయి, ప్రణవ్, అనిల్, ప్రణుదీప్, మనోజ్‌ధోనితోపాటు మరో నలుగురిని స్టాండ్‌బైగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కారుసాల నాగేశ్వరరావు (బాబు), జి.హనుమంతరావు, జి.మధు, సుధీర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గంజాయి రహిత జిల్లాగా మారుస్తాం

ఎస్పీ తుషార్ డూడీ



బాపట్ల టౌన్: జిల్లాను గంజాయి రహితంగా మార్చడమే లక్ష్యంగా పని చేస్తున్నామని ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. మంగళవారం ఎస్పీలతో రాష్ట్ర హోంమంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎస్పీ కార్యాలయం నుంచి హాజరైన ఎస్పీ తుషార్ డూడీ.. జిల్లాలోని తాజా పరిస్థితులను మంత్రికి వివరించారు. గంజాయి రవాణా, విక్రయాలను అడ్డుకుని బాధ్యులను అరెస్టు చేయాలని ఎస్పీలకు మంత్రి సూచించారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ మాట్లాడుతూ.. జిల్లాలో గంజాయి రవాణా, విక్రయం, వినియోగాన్ని అడ్డుకోవడానికి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. దానికి అనుగుణంగా గతంలో నేరాలకు పాల్పడిన వారిపై నిఘా ఉంచామని చెప్పారు. గంజాయి తీసుకునే వారు ఎక్కువగా వెళ్లే నిర్మానుష్య ప్రదేశాల్లో పెట్రోలింగ్ ముమ్మరం చేశామని పేర్కొన్నారు. ఆకతాయిల ఆగడాల నుంచి మహిళలకు, విద్యార్థినులకు రక్షణ కల్పించేందుకు ఆయా ప్రదేశాల్లో గస్తీ పెంచామన్నారు. మహిళలపై నేరాలు, పోక్సో కేసులలో దర్యాప్తు వేగవంతం చేశామని తెలిపారు. సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక టీంతో కృషి చేస్తున్నామన్నారు.

తహసీల్దార్లు బదిలీ

బాపట్ల: సాధారణ ఎన్నికల సందర్భంగా బదిలీపై వెళ్లిన తహసీల్దార్లను తిరిగి జిల్లాకు బదిలీ చేస్తూ ప్రభుత్వం మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. అద్దంకి తహసీల్దార్‌గా జి.చరణ్, సంతమాగులూరు– కె.రవిబాబు, అమర్తలూరు – కె.నెహ్రూ బాబు, కొల్లూరు– బి.వెంకటేశ్వర్లు, టి.చుండూరు– డి.మల్లికార్జునరావు, వేమూరు– బి.సుశీల, మార్టూరు– టి.ప్రశాంతి, యద్దనపూడి– కె.రవికుమార్, బాపట్ల– పి.కృష్ణకాంత్, పి.వి.పాలెం – పి.మేహర్‌కుమార్, చీరాల – కె.గోపికృష్ణ, వేటపాలెం – పి.పార్వతి, చిన్నగంజాం – జె.ప్రభాకరరావు, కొరిశపాడు – డి.వెంకటేశ్వరరావు, పర్చూరు – పి.బ్రహ్మయ్య, కారంచేడు – కె.నరసింహారావు, కర్లపాలెం –ఎస్.వెంకటరత్నం నియమితులయ్యారు. కలెక్టరేట్ అడ్మిన్ సూపరింటెండెంట్‌గా జి.వి.సుబ్బారెడ్డి, భూపరిపాలన విభాగం సూపరింటెండెంట్‌గా డి.కవిత, భూ సేకరణ విభాగం సూపరింటెండెంట్‌గా కె. సంధ్యశ్రీ,, సెక్షన్ సూపరింటెండెంట్‌లుగా సీతారత్నం, డి.నాగరాజారావు, బాపట్ల ఆర్‌డీఓ కార్యాలయం డీఏఓగా ఎ.శ్రీనివాసరావు, చీరాల డీఏఓగా సురేష్‌బాబు, రేపల్లె డీఏఓగా పి.జాన్ పీటర్‌లను నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 517.20 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 5,944 ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 22,781 ఎస్‌ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది. దీంతో సాగర్ నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 29,565 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్‌కు 2,52,386 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

‘పేకాట’లో ఇదిగో నీ వాటా!

కుమారులు, కుమార్తెలకు ఇంటి పెద్ద ఆస్తి పంపకాలు చేయడం అందరికీ తెలుసు. ప్రజాప్రతినిధులు తమ అనుచరులకు నామినేటెడ్ పదవులను కట్టబెట్టడం కూడా మనం చూస్తూనే ఉన్నాం. అయితే బాపట్ల జిల్లా రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లో మాత్రం అధికారపార్టీ నేతలు తమ అనుచరులకు పేకాట, కోడిపందేల నిర్వహణ కేంద్రాలను పంచిపెడుతుండటం గమనార్హం.



వెలమవారిపాలెం సమీపంలో పేకాట స్థావరం

ముఖ్య అనుచరులకు కీలక నేత కానుక

- కోడిపందేల నిర్వహణలోనూ అదే బాట
- సామాజికవర్గాలవారీగా కేంద్రాల ఏర్పాటు
- రేపల్లె నియోజకవర్గంలో 20కిపైగా పేకాట కేంద్రాలు
- గుంటూరు, గుడివాడ, ఒంగోలు నుంచి ఆటగాళ్లు రాక
- రోజూ చేతులు మారుతున్న రూ. కోట్లు
- ఊరూరా మొదలైన కోడిపందేలు
- చోద్యం చూస్తున్న పోలీసు యంత్రాంగం





కొల్లూరు మండలం కొన్ని లంక గ్రామాల్లో కోడిపందేలు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: రేపల్లె నియోజకవర్గంలో ఓ నేత ఇటీవలే తన అనుచరులు కొందరికి పేకాట కేంద్రాలను, మరికొందరికి కోడిపందేల కేంద్రాల ‘బాధ్యతల’ను అప్పగించారు. ఇందులో సామాజికవర్గ సమీకరణాలకూ ప్రాధాన్యత ఇవ్వడం మరో విశేషం. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి సదరు నేత చట్టవిరుద్ధమైన వ్యవహారాలను ఇలా పంచేయడం అధికార వర్గాల్లో కూడా హాట్ టాపిక్‌గా మారింది. ఇది జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశం అయింది.

రేపల్లెలో పేకాట, కోడిపందేలు జోరందుకున్నాయి. నియోజకవర్గంలోని ప్రతి మండలంలో పేకాట కేంద్రాలు మొదలయ్యాయి. నగరం మండలం వెలమవారిపాలెం సమీపంలో సుమారు ఎకరం తోటలో అతిపెద్ద పేకాట కేంద్రం వారం క్రితమే ప్రారంభమైంది. ఇక్కడ రూ.కోట్లు రోజూ చేతులు మారుతున్నట్లు సమాచారం. విజయవాడ, గుంటూరు, గుడివాడ, ఒంగోలుతోపాటు ఇతర ప్రాంతాల జూదగాళ్లు ఇక్కడికి వస్తున్నారు. మండలానికి ఐదు చొప్పున ఉన్న జూద కేంద్రాల్లో ప్రధానంగా రాత్రి పూట ఆట కొనసాగుతోంది. రేపల్లెలో రెండు సామాజికవర్గాల నేతలు పేకాట కేంద్రాలు తమకే కావాలంటూ పట్టుబట్టడంతో ముఖ్య నేత పెద్దరికంతో ఆలోచించారు. తన సామాజికవర్గంతోపాటు మరొక సామాజికవర్గం వారికి ఆ కేంద్రాలు కేటాయించారు. దీంతో ఇక్కడ రెండు పెద్ద కేంద్రాలు వెలిశాయి. చెరుకుపల్లి, నిజాంపట్నం తదితర మండలాల్లోనూ పేకాట జోరందుకుంది. నగరం, చెరుకుపల్లి, రేపల్లెలో బలమైన రెండు సామాజికవర్గాలకు చెందిన నేతలు, నిజాంపట్నం మండలంలో వెనుకబడిన సామాజికవర్గానికి చెందిన నేత పేకాట కేంద్రాలను మొదలు పెట్టారు.

పర్యవేక్షణకు ఓ నాయకుడు కూడా...

రెండు దశాబ్దాలుగా పేకాట బ్రోకర్‌గా పేరొందిన రేపల్లెకు చెందిన బీసీ సామాజికవర్గం వ్యక్తి నియోజకవర్గంలో జరుగుతున్న జూద కేంద్రాలను పర్యవేక్షిస్తున్నాడు. అతడి ద్వారా గుంటూరు, విజయవాడ, ఒంగోలుతోపాటు ఇతర ప్రాంతాల్లోని పెద్ద జూదగాళ్లు ఇక్కడికి వస్తున్నట్లు తెలుస్తోంది. పెద్ద మొత్తంలో ఆడే ఆటగాళ్లు వెలమవారిపాలెం, ఒక మోస్తరులో ఆడే వారికి నియోజకవర్గంలో మిగిలిన మండలాల పరిధిలో ఏర్పాటు చేసిన దాదాపు 20 కేంద్రాలు కేటాయించారు. ఇక రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లోని గ్రామాల్లో నిత్యం కోడిపందేలు జోరుగా సాగుతున్నాయి.

పట్టించుకోని పోలీసులు...

రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున పేకాట కేంద్రాలు ఏర్పాటు చేసినా పోలీసులు కనీసం అటువైపు తొంగిచూడటం లేదన్న ఆరోపణలున్నాయి. రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ సొంత నియోజకవర్గం కావడం, జూద కేంద్రాలు నడిపిస్తున్నది అధికారపార్టీ నేతలే కావడంతో పోలీసులు మిన్నకుండిపోతున్నారని తెలుస్తోంది. పేకాట, కోడిపందేల కేంద్రాల నుంచి కొందరు పోలీసు ఉన్నతాధికారులకు ముడుపులు కూడా అందుతున్నట్లు తెలుస్తోంది.

బీచ్‌లో ప్రమాదాల నివారణ ముఖ్యం

- అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా కలెక్టర్ వెంకట మురళి సూచన
- ముందస్తు జాగ్రత్త చర్యలకు ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

బాపట్ల: బీచ్‌లలో ప్రమాదాలు జరగకుండా అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి ఆదేశించారు. బీచ్‌ల వద్ద ప్రమాదాల నివారణపై జిల్లా స్థాయిలో మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. సూర్యలంక, వాడరేవు, రామాపురం బీచ్‌ల వద్ద ప్రజలు నీటిలో దిగడానికి హద్దును సూచిస్తూ హెచ్‌పీడీపీ పైపులను ఏర్పాటు చేయాలన్నారు. పర్యాటకులు అధికంగా వచ్చే ఈ బీచ్‌ల వద్ద సంరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. కార్తిక మాసంలో అత్యధికంగా పర్యాటకులు వస్తుంటారని గుర్తు చేశారు. పరిశుభ్రతకు బాధ్యత పంచాయతీ అధికారులదేనని పేర్కొన్నారు. షికారు కోసం ప్రత్యేక బోట్లు, భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్లాస్టిక్ వస్తువులు వినియోగించరాదని చెప్పారు. ఇందుకోసం ప్రత్యేకంగా ప్రచార బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. పర్యాటకులు అధికంగా సందర్శించే ప్రాంతాలలో కొబ్బరి, సరుగుడు, తదితర మొక్కలు నాటాలని సూచించారు. శని, ఆదివారాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఒక్కొక్క బీచ్ వద్ద 25 మంది గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. మద్యం తాగి సముద్రంలోకి వెళ్లి సందర్శకులు మునగకుండా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నారు. 15 వేల మంది సముద్రంలోని మత్స్య సంపదపై ఆధారపడి జీవిస్తున్నారని చెప్పారు. వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బీచ్‌లను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని సూచించారు. బీచ్‌ల వద్ద భూ ఆక్రమణల నివారణకు అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా సంయుక్త కలెక్టర్ బి. సుబ్బారావు, అదనపు ఎస్పీ విఠలేశ్వరరావు, చెన్నైకి చెందిన తీర పరిశోధన జాతీయ కేంద్రం మేనేజ్‌మెంట్ ప్లానర్ బి. సుధీర్, ఆర్డీవోలు, అనుబంధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలను అరికట్టాలి

బాపట్ల: ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలు, రవాణాను పూర్తిగా అరికట్టాలని, అవసరమైతే క్రిమినల్ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి చెప్పారు. ఇసుక జిల్లా స్థాయి కమిటీ సమావేశం మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. జిల్లాలో ఇసుక అవసరమైన వారంతా ఎన్టీఆర్, గుంటూరు జిల్లాకు వెళ్లి ఉచితంగా తెచ్చుకోవచ్చని తెలిపారు. ఉచిత ఇసుక విధానాన్ని ప్రభుత్వం సమర్థంగా అమలు చేస్తోందన్నారు. గాజుర్లంక, జువ్వలకుంట రేవుల వద్ద త్వరలో ఇసుక అందుబాటులోకి రానుందన్నారు. అక్రమంగా ఎవరైనా తవ్వితే అధికారులే బాధ్యులని హెచ్చరించారు. మండల, గ్రామ స్థాయి కమిటీలు పరిస్థితిని పర్యవేక్షించాలని సూచించారు. అక్రమ తవ్వకాలపై పత్రికలలో ప్రచురితమైన కథనాలపై ఆయన సుదీర్ఘంగా చర్చించారు. జిల్లా సంయుక్త కలెక్టర్ బి. సుబ్బారావు, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, అదనపు ఎస్పీ విఠలేశ్వరరావు, ఏడీ రాజేష్, ఆర్డీవోలు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

- గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి
- లక్ష్యసాధన దిశగా కృషి చేసి ఉన్నత స్థానాలను పొందాలి
- ఎమ్మెల్యే బి రామాంజనేయులు
- లయోలాలో ఆంధ్రా తెలంగాణ రీజినల్ బాలికల బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం

గుంటూరు రూరల్: ప్రతి ఒక్కరూ కూడా విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని, క్రీడలలో పాల్గొనడం వల్ల విద్యార్థులు ఆలోచనాశక్తి, సామర్థ్యాలు పెంచుకోవచ్చని జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం రూరల్ మండలం నల్లపాడు గ్రామంలోని లయోలా పాఠశాలలో ఆంధ్రా, తెలంగాణ రీజియన్ ఐసీఎస్ఈ, ఐఎస్ఈ పాఠశాలల బాలికల బాస్కెట్‌బాల్ పోటీలను జిల్లా కలెక్టర్ ప్రత్తిపాడు ఎమ్మెల్యే బి రామాంజనేయులుతో కలసి ప్రారంభించారు. ముందుగా క్రీడా జ్యోతిని వెలిగించి, బెలూన్స్, పావురాలను ఎగురవేసి పోటీలను ప్రారంభించారు. విద్యార్థిని బృందం చేసిన స్వాగత నృత్యం అందరినీ ఆకర్షించింది. కలెక్టర్ మాట్లాడుతూ తనకు బాస్కెట్‌బాల్ క్రీడ అంటే అమితమైన ఇష్టమని ఎన్‌బీఏ ద్వారా నిర్వహించే ప్రపంచ స్థాయి క్రీడా పోటీలు వేకువజాముల్లో టీవీలలో ప్రసారం అయ్యేవని వాటిని ఇష్టంగా తిలకించడం జరిగేదన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులు బాస్కెట్‌బాల్ లాంటి క్రీడను ఎంపిక చేసుకోవటం ఆనందకరమన్నారు. క్రీడాకారులు తమ ప్రతిభను నిరూపించుకోడానికి ఇదొక మంచి అవకాశమన్నారు. పాఠశాల కరస్పాండెంట్ రెవరెండ్ ఫాదర్ డాక్టర్ పి ఆంతోని మాట్లాడుతూ మూడు రోజులపాటు జరిగే పోటీల్లో మొత్తం 45 జట్లు పాల్గొంటున్నాయని చెప్పారు. క్రీడాకారులు క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తితో ఆడి క్రీడలు విజయవంతం చేయాలని కోరారు. పాఠశాల ప్రిన్సిపల్ రెవరెండ్ ఫాదర్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది, ఉపాధ్యాయేతర సిబ్బంది ఈ పోటీల విజయవంతానికి ఎంతో శ్రమిస్తున్నారన్నారు.

గ్రామ సచివాలయానికి పసుపు రంగు



చిన్నగంజాం: పర్చూరు మండలంలోని కొల్లావారిపాలెం గ్రామ సచివాలయాన్ని పసుపు రంగుతో నింపి దాదాపుగా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలా మార్చివేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో గ్రామ సచివాలయ వ్యవస్థను ప్రవేశ పెట్టి, ప్రతి రెండు వేల మంది జనాభాకు సచివాలయాలు ఏర్పాటు చేసింది. అందుకోసం పక్కా భవనాలను నిర్మించింది. నాడు సచివాలయ భవనాలకు వేసిన రంగులపై టీడీపీ తీవ్ర విమర్శలు గుప్పించింది. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక మాత్రం టీడీపీ వారు సచివాలయ భవనానికి ఇలా పసుపు రంగు వేయడం గమనార్హం.

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వడం సరైన చర్య

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): ప్రతిపక్ష హోదా ఇవ్వడానికి సంఖ్యా బలం నిబంధన లేనప్పుడు అసెంబ్లీలో వైఎస్సార్ సీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వడం సరైన చర్య అని కమ్యూనిస్టు ఇండియా జాతీయ కార్యదర్శి తోట సంగమేశ్వర రావు(సంగమ్) మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీ స్పీకర్‌కు రాసిన లేఖపై సకాలంలో సరైన చర్య తీసుకోకపోవడం చట్టసభల విలువను దిగజార్చడమేనని అభిప్రాయపడ్డారు. పంతాలు, పట్టింపులకు కక్షలు కార్పణ్యాలకు తావివ్వడానికి స్పీకర్ స్థానం ఆలంబన కాకూడదని ఈ సందర్భంగా వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



గుంటూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనగా వ్యక్తి మృతి చెందిన సంఘటన నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం అంకిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన శ్యామల రాజగోపాల్‌రెడ్డి(50) మధ్యాహ్నం సమయంలో తమ గ్రామానికి ద్విచక్రవాహనంపై వెళుతూ ఉండగా చిలకలూరిపేట నుంచి ద్విచక్రవాహనంపై వెళుతున్న మహిళ పాత్తూరు వద్ద హైవే అండర్‌పాస్ వద్ద ఢీకొంది. ప్రమాదంలో రాజగోపాల్‌రెడ్డికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనపై మృతుడి భార్య శ్యామల లక్ష్మీకాంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి మృతుడి కుటుంబ సభ్యులకు అప్పగించనున్నట్లు తెలిపారు.

కుటుంబ కలహాలు, అప్పులతో రైతు ఆత్మహత్య



క్రోసూరు: మండలంలోని పీసపాడు గ్రామానికి చెందిన గొర్రెపాటి దానయ్య(65) సోమవారం కుటుంబాల కలహాలు, వ్యవసాయంలో చోటు చేసుకున్న అప్పుల నేపథ్యంలో ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు గోపి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ ఎం.షఫీ తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ ఫిర్యాదులో తన తండ్రి కుటుంబ కలహాలు, వ్యవసాయంలో వచ్చిన నష్టాలతో అప్పులు అధికమవ్వటంతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపాడన్నారు. మృతునికి భార్య, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె కలదు. మంగళవారం పోస్టుమార్టం పూర్తిచేయించి, మృతదేహాన్ని కుటుంబీకులకు అందచేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పట్టుదలతో విధిరాతకు ఎదురీత

- సంకల్పం ముందు ఓడిన వైకల్యం
- ఉత్తమ లైబ్రేరియన్ శివాజీగణేషన్ స్ఫూర్తి

బాపట్ల పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదంటారు.. ఆయన్ను చూస్తే అది నిజమే అనిపిస్తుంది. పుట్టుకతో రెండు కాళ్లు చచ్చుపడిపోయినా చలించలేదు. కొందరు మిత్రుల నుంచే సూటిపోటి మాటలు ఎదురైనా భరించారు. ఏదో సాధించాలనే తపన ఆయన్ను నీడలా వెన్నాడింది. తల్లితండ్రుల ప్రోత్సాహం, సోదరుడి సహకారం ముందుకు నడిపించాయి. చివరికి ఆత్మవిశ్వాసం ముందు వైకల్యం తలవంచింది. విధి రాతను జయించి లైబ్రేరియన్‌గా రాణిస్తూ ఎందరికో ఆదర్శంగా నిలిచారు శివాజీగణేషన్. గ్రేడ్–1 లైబ్రేరియన్‌గా అందరి మన్ననలు పొందుతున్నారు. శివాజీగణేషన్ స్ఫూర్తి ప్రస్థానం ఆయన మాటల్లోనే...

''మాది బాపట్ల జిల్లా కర్లపాలెం గ్రామం. తల్లి భాగ్యలక్ష్మి, తండ్రి అంగలకుదుడు వెంకటేశ్వర్లు. వ్యవసాయ కుటుంబం. ఇద్దరం అన్నదమ్ములం. నాకు ఎనిమిదేళ్ల వయస్సులో పోలియో సోకింది. అమ్మానాన్న నిరక్షరాస్యులు కావటంతో వ్యాధి నిరోధక చర్యలు తీసుకోలేకపోయారు. రెండు కాళ్లు చచ్చుబడిపోవటంతో వారి వేదన అంతా అంతా కాదు. చదువుకునేందుకు ఎంతో సహకరించారు. రోజూ అమ్మో, నాన్నో ఎత్తుకుని పాఠశాలకు తీసుకెళ్లేవారు. వారు రాలేని సందర్భాల్లో నేనే అతికష్టం మీద వెళ్లే వాడిని. వర్షాకాలం వస్తే చాలు పుస్తకాలు తడిసిపోయేవి. స్కూల్ వదిలిపెట్టగానే తోటి పిల్లలు చకచకా వెళ్లేవారు. నేను వర్షంలో తడుచుకుంటూ వచ్చే వాడిని. పాఠశాలకు వెళ్లకూడదని ఐదు రోజులపాటు ఇంట్లోనే ఉన్నాను. అమ్మ, నాన్న ఎంతో సర్ది చెప్పారు. చదువు లేకపోతే ఇబ్బంది పడతావని చెప్పారు. వారి మాట మేరకు తిరిగి చదువు ప్రారంభించా. అప్పటి నుంచి పాఠశాలకు వెళ్లడంలో వెనుకడుగు వేయలేదు. ఆ రోజు తల్లిదండ్రుల మాట వినకపోతే నేడు ఏ పరిస్థితిలో ఉండే వాడినో తలుచుకుంటేనే భయమేస్తోంది. కబడ్డీ అంటే చాలా ఇష్టం. కాళ్లు బాగుంటే కబడ్డీ ఆడేవాడిని. ఆడే వారిని చూస్తుంటే కళ్లు చెమరుస్తాయి.



గతేడాది ఉత్తమ లైబ్రేరియన్‌గా అప్పటి మంత్రి నుంచి అవార్డు అందుకుంటున్న దృశ్యం



శివాజీగణేషన్‌ను సన్మానిస్తున్న పాఠకులు

కర్రల సహాయంతో కళాశాలకు..

కర్లపాలెంలో ఇంటర్ చదివేటప్పుడు కర్రల సహాయంతో కళాశాలకు వెళ్లేవాడిని. ఆ సమయంలో తమ్ముడు రవి ఆసరాగా నిలిచారు. రోజూ ఆయనే పుస్తకాలు తీసుకొచ్చేవారు. బాపట్లలో డిగ్రీ చదివేటప్పుడు ఒకే గదిలో ఉండేవాళ్లం. అలా అన్ని విధాలుగా ప్రోత్సాహం మరువలేనిది. గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాక కర్లపాలెంలో ప్రయివేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా మూడేళ్లు పని చేశా. సంపాదించిన దాంట్లో నుంచి కొద్దిగా తమ్ముడి చదువుకు ఖర్చు పెట్టడం, మిగిలింది నా ఎంఎ కోర్సుకు ఉపయోగించుకోవడం జరిగింది. లైబ్రరీ సైన్స్ పూర్తి చేసుకున్న తరువాత జిల్లాలో ఒక పోస్టుకు నోటిఫికేషన్ పడింది. ఎనిమిది మంది పోటీ పడ్డాం. అప్పుడు సంయుక్త కలెక్టర్‌గా టీజీ వెంకటేశం ఉన్నారు. నా కష్టానికి ప్రతిఫలంగా ఆ ఉద్యోగానికి ఎంపిక చేశారు. జీవితంలో ఎప్పుడూ అవిటివాడిని అనే ఆలోచన రానివ్వొద్దు అని భుజంతట్టి ప్రోత్సహించారు. తొలి పోస్టింగ్ మాచర్లలో గ్రేడ్–2 లైబ్రేరియన్‌గా చేరాను. నిరుద్యోగులకు నా వంతు సహాయ, సహకారాలు అందిస్తున్నా. నా డబ్బులతో ఎప్పటికప్పుడు కొన్ని కొత్త పుస్తకాలు తీసుకొచ్చి ప్రోత్సహిస్తున్నా. సేవలకు గుర్తుగా అనేక స్వచ్ఛంద సంస్థలు సన్మానాలు చేశాయి. ప్రభుత్వాలు ప్రోత్సాహకాలు కూడా ఇచ్చాయి. చుట్టూ ఉన్న చీకటిని తిట్టుకుంటూ కూర్చోవడం కంటే చిరుదీపం వెలిగించాలనే భావనతో ముందుకుసాగాను. లైబ్రేరియన్‌గా ఉద్యోగంలో చేరిన దగ్గర ఉంచి ఎంతో మందికి ఉద్యోగాలు వచ్చేందుకు కృషి చేశాను. సొంత ఖర్చులతో పుస్తకాలు, సీడీలు కొనుగోలు చేసి ఇచ్చాను. ఇందుకు గతేడాది ప్రభుత్వం ఉత్తమ లైబ్రేరియన్‌గా అవార్డు ఇచ్చి సన్మానించింది. 2008లో నాగమణితో వివాహం కాగా, కుమార్తె నాగలక్ష్మి, కుమారుడు గిరీంద్రబాబు ఉన్నారు. కష్టపడి చదువుకుని ముందుకుసాగాలని నిరుద్యోగులకు నా సూచన.''



విధులకు హాజరవుతున్న శివాజీగణేషన్

పీహెచ్‌సీ వైద్యుడిని విచారించిన జిల్లా అధికారులు

తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బంది డిమాండ్

వేటపాలెం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు బాలరాజుపై వచ్చిన ఆరోపణలపై జిల్లా అధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. డాక్టర్ బాలరాజు, సిబ్బందిని జిల్లా వైద్యశాఖ నుంచి వచ్చిన డీఐఓ వెంకటేశ్వరరావు, డీపీఎం డాక్టర్ రోహిణి, జిల్లా కోఆర్డినేటర్ ప్రేమపావని విచారణ చేశారు. ఫార్మసిస్టు వెంకట ప్రసాద్‌ను కూడా విచారించారు. తదుపరి వైద్యశాల సిబ్బందిని ప్రత్యేకంగా ఒకరి తరువాత ఒకరిని పిలిచి మాట్లాడారు. విచారణ అధికారులు మాట్లాడుతూ.. డీఎంహెచ్ఓ ఆదేశాల మేరకు వచ్చామని తెలిపారు. వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, సూపర్‌వైజర్లు వారి ఎదుట ప్లకార్డులతో నిరసన తెలిపారు. మహిళా ఉద్యోగులతో అసభ్యంగా ప్రవర్తిస్తూ వేధింపులకు పాల్పడుతున్న డాక్టర్‌పై వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. తరచూ వైద్యశాల సిబ్బందితో గొడవ పెట్టుకొని పోలీస్‌స్టేషన్‌లో కేసులు పెడుతున్నారని వాపోయారు. సంవత్సరం కాలంగా డాక్టర్ తీరు కారణంగా రోగులు కూడా రావడం లేదని తెలిపారు. డాక్టర్‌పై అనేక సార్లు డీఎంహెచ్ఓకి ఫిర్యాదులు చేసినా తగిన చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటి వరకు ఐదు సార్లు జిల్లా అధికారులు విచారణ పేరుతో వేటపాలెం వచ్చి వెళ్లారని గుర్తుచేశారు. ఇకనైనా చర్యలు తీసుకోవాలని కోరారు.



డాక్టర్ బాలరాజును విచారిస్తున్న జిల్లా అధికారులు



పీహెచ్‌సీ వద్ద ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు

ఎన్ఈసీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్ల సాహసం

నరసరావుపేట రూరల్: పర్వతారోహణలో నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు ప్రతిభ చాటారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని దిరాంగ్‌లో మే 25 నుంచి జూన్ 25 వరకు ట్రెక్కింగ్, పర్వతారోహణ క్యాంప్ నిర్వహించారు. ఇందులో భాగంగా దిరాంగ్ న్యూ మెల్లింగ్, మాగో జీతాంగ్, మీరతాన్‌తో పాటు అతి ఎత్తయిన గోరిచేన్ గ్లాసియర్ మంచుపర్వతాన్ని అధిరోహించడంతో పాటు ఆర్టిఫిషియల్ వాల్ క్లైంబింగ్, ఐస్ వాల్ క్లైంబింగ్, రివర్ క్రాసింగ్ తదితర సాహస కార్యక్రమాలు నిర్వహించారు. నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఎం.వెంకట సుస్వంత్, ఎ.ఆర్తిలు క్యాంప్‌లో పాల్గొని ప్రతిభ చూపారు. 3,200 అడుగుల ఎత్తు ఉన్న గోరిచెన్ గ్లేసియర్ మంచు పర్వతాన్నిఅధిరోహించి రికార్డు సృష్టించారు. గుంటూరు గ్రూపు ఎన్‌సీసీ కార్యాలయంలో గ్రూపు కమాండర్ ఎస్ఎం చంద్రశేఖర్ వీరికి ధ్రువీకరణపత్రాన్ని అందజేసి సత్కరించారు. 23వ ఆంధ్ర బెటాలియన్‌కు మంచి పేరు తీసుకువచ్చిన క్యాడెట్స్‌ను కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు సన్మానించారు.

ప్రజాపంపిణీ వ్యవస్థ బలోపేతానికి కృషి

జిల్లా జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు

బాపట్ల: ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి అందరూ కృషి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు అన్నారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆదేశాల మేరకు ప్రజాపంపిణీ వ్యవస్థను బలోపేతం చేసేందుకు వివిధ సంస్థలు, రైతులు, వినియోగదారుల నుంచి ప్రజాభిప్రాయ సేకరణకు కలెక్టరేట్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఇందులో బి.సుబ్బారావు మాట్లాడుతూ.. 60 ఏళ్లుగా ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు నిత్యావసర వస్తువులను ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. ఇంటింటికీ రేషన్ పంపిణీ చేసే స్థాయికి మెరుగు పడిందని పేర్కొన్నారు. కేరళ తరహాలో పంపిణీ జరుగుతోందని తెలిపారు. బియ్యంతోపాటు చింతపండు, కారం, పసుపు, ఉప్పు, మినుములు పంపిణీ చేయాలని పలువురు సూచించారు. ఈ సమావేశంలో డీఎస్ఓ ఇ.బి.విలియమ్స్, డీఆర్ఓ సత్తిబాబు, ఆర్డీఓ రవీంద్రబాబు, జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి పి.లిల్లీ, ఫుడ్ సేఫ్టీ అధికారి దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బి.సుబ్బారావు

డబ్బు కోసమే విశ్రాంత ఉపాధ్యాయురాలి హత్య

- కేసు వివరాలు వెల్లడించిన ఇన్‌చార్జి డీఎస్పీ
- నిందితుడి నుంచి నగదు, ఆయుధం స్వాధీనం

చీరాల టౌన్: బాపట్ల జిల్లా ఈపురుపాలెంలో విశ్రాంత తెలుగు ఉపాధ్యాయురాలు పిల్లి లలితమ్మ (78) దారుణ హత్య మిస్టరీని పోలీసులు ఛేదించారు. గత మంగళవారం రాత్రి ఈపురుపాలెం హైస్కూల్ వెనుక జెండా చెట్టు, బూదాటివారి వీధిలో ఒంటరిగా నివాసం ఉంటున్న లలితమ్మను కేబుల్ కనెక్షన్ బాయ్‌గా పనిచేసే వ్యక్తి హత్య చేశాడు. వారం రోజులుగా ఆరు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టారు. ఎట్టకేలకు నిందితుడు పోసా ఆంజనేయులును పోలీసులు అరెస్టు చేశారు. ఈ వివరాలను చీరాల ఇన్‌చార్జి డీఎస్పీ పి.జగదీష్ నాయక్ మంగళవారం రాత్రి ఈపురుపాలెం పోలీస్ స్టేషన్లో విలేకరులకు వెల్లడించారు. ఇన్‌చార్జి డీఎస్పీ కథనం ప్రకారం.. పిల్లి లలితమ్మ వద్ద భారీగా నగదు, బంగారం ఉంటుందనే అత్యాశతో కేబుల్ కలెక్షన్ బాయ్‌గా పనిచేసే తోటవారిపాలెం వీవర్స్ కాలనీకి చెందిన పోసా ఆంజనేయులు ఆమెను కత్తితో పొడిచి హత్య చేశాడు. బీరువాలో దొరికిన డబ్బుతో పరారయ్యాడు. హతురాలి కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆమె ఇంటికి వచ్చి వెళ్లే వారి వివరాలు, అనుమానితులు, పలు పాతకేసుల్లో ముద్దాయిల కదలికలు, ఘటన ప్రాంతంలో సెల్‌ఫోన్ సిగ్నళ్ల ఆధారంగా దర్యాప్తు చేశామన్నారు. సబ్‌డివిజన్ పరిధిలో సీనియర్ సీఐలను ఆరు బృందాలుగా ఏర్పాటు చేసి దర్యాప్తు కొనసాగించామన్నారు. అనంతరం పోసా ఆంజనేయులును వాడరేవు సమీపంలోని దత్తాత్రేయ హేచరీ వద్ద అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా.. అధికంగా డబ్బు, నగలు ఉన్నాయనే ఆశతో లలితమ్మను హత్య చేసినట్లు అంగీకరించాడని తెలిపారు. బీరువాలో ఉన్న రూ.9,500 నగదు తీసుకుని పారిపోయానని పేర్కొన్నట్లు చెప్పారు. నిందితుడి ఇంటి వద్ద హత్యకు వినియోగించిన ఆయుధం, రక్తపు మరకలు ఉన్న దుస్తులు, ద్విచక్ర వాహనం, ఫోన్, రూ.9,500 నగదు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. లలితమ్మ భర్త పదేళ్ల క్రితం చనిపోయారు. ఇద్దరు కుమారులు అమెరికాలో స్థిరపడగా, కుమార్తె విజయవాడలో నివాసం ఉంటోంది. కేసును త్వరగా ఛేదించిన సీఐలు సత్యన్నారాయణ, సోమశేఖర్, అద్దంకి, ఇంకొల్లు సీఐలు శివరామకృష్ణారెడ్డి, శ్రీనివాసరావు, రూరల్ ఎస్సైలు శివకుమార్, సురేష్, వెంటకేశ్వర్లు, శ్రీనివాసరావు, తిరుపతయ్య, తదితరులను ఇన్‌చార్జి డీఎస్పీ అభినందించారు. చీరాల సబ్ డివిజన్ పరిధిలో ఒంటరిగా ఉంటున్న వృద్ధులు, విశ్రాంత ఉద్యోగుల వివరాలను సేకరిస్తున్నామని ఆయన తెలిపారు. వారి భద్రతకోసం ప్రత్యేకంగా నిఘా ఉంటుందన్నారు.



పిల్లి లలితమ్మ (ఫైల్)

వైఎస్సార్ సీపీ కార్యకర్తకు రూ.50 వేలు సాయం

విజయవాడ స్పోర్ట్స్: టీడీపీ గూండాల దాడితో గాయపడిన బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గం చిలుమూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త చిమటా సురేష్, జ్యోతి దంపతులకు ఆ పార్టీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మోదుకూరి హరిబాబు ఆర్థిక సాయం చేశారు. విజయవాడ లబ్బీపేటలోని ఆయన నివాసం వద్ద దంపతులకు రూ.50 వేల చెక్కును అందజేశారు. ఎన్నికల ఫలితాల తరువాత వైఎస్సార్ సీపీ సానుభూతిపరులపై టీడీపీ నాయకులు దాడులు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థకు మాయని మచ్చని హరిబాబు అన్నారు. 45 రోజుల్లో టీడీపీ నాయకులు చేసిన దౌర్జన్యాలు, దాడుల కారణంగా రాష్ట్రంలో శాంతిభద్రతలకు తీవ్ర విఘాతం ఏర్పడిందన్నారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల ఆస్తులను లక్ష్యంగా చేసుకుని దాడులకు తెగబడటం సిగ్గుచేటన్నారు. ఈ దాడుల్లో ఎంతో మంది అమాయకులు ఇబ్బందులు పడ్డారన్నారు. పార్టీ అధినాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో నష్టపోయిన ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తున్నామని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే వేమూరు నియోజకవర్గంలో ఇప్పటి వరకు ఐదుగురికి రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం అందించి, భరోసా కల్పించినట్లు పేర్కొన్నారు.



సురేష్, జ్యోతి దంపతులకు చెక్కు అందిస్తున్న బీసీ సెల్ నాయకుడు హరిబాబు

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ డైరెక్ట్ 10th 1సం. ఇంటర్ (MPC BPC CEC MEC HEC) తెలుగు & ఇంగ్లీష్ మీడియం (APOSS/NIOS) 2024 రిజల్ట్‌లో 100% పాస్ Cont : MSM Jr. College, Guntur. 93907 51544, 73867 06839

■ DMLT, హెల్త్ అసిస్టెంట్/శానిటరీ ఇన్స్‌పెక్టర్, అనస్తీషియా టెక్నీషియన్ కోర్సులు కలవు. Qul: ఇంటర్ పాస్ ఫ్రీ సీట్స్ కొరకు MSM Paramedical College, Guntur. 93907 51544, 73867 06839

REAL ESTATE

PLOT FOR SALE

■ కాజా, కంతేరు, తాడికొండ, పెదపరిమి అమరావతి మొదలగు అన్ని గ్రామాల నందు పొలములు, లేఅవుట్‌లలో ప్లాట్లు అమ్మదలచిన/కొనదలచినవారు. 9000434754.

SERVICES

BUSINESS OFFER

■ మీరు బైబ్యాక్ అగ్రిమెంట్‌తో లాభదాయకమైన లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబీ డైపర్ మెషిన్, ప్లాస్టిక్ ఉద్యోగ్ వ్యాపారాన్ని ప్రారంభించండి. (ప్రభుత్వ ఆమోదితము) 8376001873, 9643010487, 83760 89771, 011-25920179

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 91699 22299

SECOND SALE

■ స్కూల్ మరియు కాలేజీలకు అవసరమైన విద్యార్థులు క్లాసు రూములో చదువుకునే మంచి నాణ్యమైన పాత బెంచీలు అమ్మబడును. కావలసిన వారు సంప్రదించగలరు. ఫోన్: 91000 69416

WANTED

■ గుంటూరు జిల్లాలోని ప్రముఖ ఫైనాన్షియల్ ఆఫీసులలో పనిచేయుటకు టెలికాలర్స్-5, కంప్యూటర్ ఆపరేటర్స్-3, క్యాషియర్స్-2, క్లర్క్స్-6, కలెక్షన్ బాయ్స్ 10, ఆఫీస్ బాయ్స్ -5, సేల్స్ పర్సన్-5 కావలెను. 90307 40757

■ Need fluent English speaking and learning employees and receptionist are wanted best salary. Contact : 89784 19769

■ Required Hospital Catering Manager Qualification: 3 years Experience in Dietary Services Work Place: AIIMS Hospital, Mangalagiri ✆ 9849989209

■ గుంటూరు జిరాక్స్ షాపు నందు పనిచేయుటకు తెలుగు & ఇంగ్లీష్ టైపింగ్ చేయగలవారు కావలెను. మరియు జిరాక్స్ తీయుటకు అనుభవం గలవారు కావలెను. ✆ 84414 38523

■ విజయవాడలో NRI / సంపన్నుల ఇళ్ళ వద్దే ఉండి పెద్దవారిని / బెడ్ పేషెంట్‌లని చూసుకొనుటకు కేర్ టేకర్స్ M/F, ఆయాలు, నర్సులు కావలెను. మంచి జీతం, సదుపాయం. ✆ 91606 35559, 96850 25559

■ ప్రముఖ కంపెనీలో వర్క్ ఫ్రం హోం వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం 15-28 వేలు. కాల్/ వాట్సప్ చేయగలరు. సంప్ర. సెల్ : 81218 18692

■ రాష్ట్ర వ్యాప్తంగా త్వరలో ప్రారంభించు బ్రాంచీల కొరకు బ్రాంచి మేనేజర్లు, క్లర్కులు, ఆఫీస్ స్టాఫ్ కావలెను. అమరావతి మ్యారేజ్ బ్యూరో, కావలి. సెల్:87902 75481, 94941 46145(వాట్సప్).

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ.475/- మాత్రమే
ప్రతి అదనపు లైను రూ.100 మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు
గుంటూరు
7075167541
7075167663

గమనిక

పరిశ్రమల స్థాపనకు అధిక ప్రోత్సాహం

బాపట్ల: పరిశ్రమల స్థాపనకు అధిక ప్రోత్సాహం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. పీఎంఈజీపీ (ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం) అమలు తీరుపై అధికారులతో మంగళవారం స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో సమావేశం జరిగింది. ఉత్పత్తి రంగాల ప్రోత్సాహకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయని జిల్లా కలెక్టర్ చెప్పారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో 138 పరిశ్రమల స్థాపన ప్రభుత్వ లక్ష్యం కాగా, 61 దరఖాస్తులు అందాయన్నారు. ఇప్పటికే 25 యూనిట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. మినీ గోకులాల పథకం లక్ష్యాన్ని చేరుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. జిల్లాలో 775 యూనిట్లు స్థాపించాలని ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. 90 శాతం రాయితీపై రుణాలు అందజేస్తామన్నారు. జిల్లా పరిశ్రమల శాఖ అధికారి వై. రామకృష్ణ, ఖాదీ గ్రామీణ పరిశ్రమల మండలి డీడీ రమేష్ బాబు, ఎల్‌డీఎం శివ కృష్ణ, డ్వామా పీడీ రాజేష్, అనుబంధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాల పెంపునకు చర్యలు

పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన జిల్లా స్కిల్ డెవలప్మెంట్ ప్రణాళికపై మంగళవారం స్థానిక కలెక్టరేట్ క్యాంప్ కార్యాలయంలో సమావేశం జరిగింది. వ్యవసాయ ఆధారిత పరిశ్రమల్లో ఉన్న అవకాశాలను గుర్తించి గ్రామీణ యువతకు అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో పరిశ్రమల ఆధారంగా ఆయా రంగాల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బాపట్ల జిల్లాలో ఆక్వా రంగం అధికంగా అభివృద్ధి చెందుతున్న దృష్ట్యా అవకాశాలు కూడా అందులో ఉంటాయన్నారు. వాటికి సంబంధించిన కోర్సులలో ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ కల్పనపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఇందుకోసం అధికారులు సమగ్ర ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి తమ్మాజీరావు మాట్లాడుతూ జిల్లాలో ప్రణాళిక ఉద్దేశాలను వివరించారు. సమావేశంలో డీఆర్‌డీఏ పి.డి. వైపీ రెడ్డి, మెప్మా పి.డి. వెంకటేశ్వర్లు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి రామకృష్ణ, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి రఘు పాల్గొన్నారు.

ఉద్యోగులపై దాడులు చేస్తే కఠిన చర్యలు



మాచర్ల రూరల్: విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వాధికారులపై దాడులకు పాల్పడితే వారు ఎంతటివారైనా కఠిన చర్యలు తప్పవని గురజాల డీఎస్పీ సిహెచ్ శ్రీనివాసరావు హెచ్చరించారు. మంగళవారం మాచర్ల రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెల్దుర్తి మండలంలోని హనుమాపురంతండా ప్రాంతంలో అలుగు స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న ఫారెస్టు అధికారిపై దాడికి పాల్పడిన సంఘటనపై ఆయన స్పందించారు. వెల్దుర్తి మండలం అటవీ ప్రాంతంలో కొంతకాలంగా కొంతమంది వ్యక్తులు ముఠాగా ఏర్పడి వన్యప్రాణులను స్మగ్లింగ్ చేస్తున్నారని, ఈ క్రమంలోనే హనుమాపురంతండాకు చెందిన దేశావత్ గోవింద్‌నాయక్, అటవీ ప్రాంతంలోని వన్యప్రాణి అయిన అలుగును అమ్మేందుకు సిద్ధమవుతున్న తరుణంలో వీపీ సౌత్ ఫారెస్టు రేంజ్ అధికారి సత్యనారాయణరెడ్డి స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న గోవింద్ నాయక్‌ను అదుపులోకి తీసుకొని పోలీసు స్టేషన్‌కు తరలిస్తుండగా ఆ వాహనం పై పలువురు వ్యక్తులు ఒక్కసారిగా రాళ్లదాడికి పాల్పడి సత్యనారాయణరెడ్డిని తీవ్రంగా గాయపరిచారన్నారు. ఈ సంఘటన పై పోలీసులు వెంటనే స్పందించి ఐదుగురిని అదుపులోకి తీసుకోవటం జరిగిందన్నారు. పరారీలో ఉన్నవారి కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వాధికారులపై దాడులకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, ఈ విషయంలో ఎవరు తమపై ఎవరు ఒత్తిడి చేసినా వదిలే ప్రసక్తి ఉండదన్నారు. శాంతిభద్రతలు కాపాడటంలో ఉన్నతాధికారులు తమకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారని, ప్రజలకు రక్షణ కల్పించటంలో పోలీసు శాఖ నిస్వార్థంగా పనిచేస్తుందని స్పష్టం చేశారు. రూరల్ సీఐ బాలాజీ, వెల్దుర్తి ఎస్ఐ ఎం.సత్యనారాయణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు రైతు మృతదేహానికి పోస్టుమార్టం

ఖననం చేసిన రెండురోజుల తర్వాత బయటకు తీసి శవ పంచనామా

ప్రత్తిపాడు:అప్పుల బాధతో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన కౌలు రైతు మృతదేహాన్ని ఖననం చేసన రెండు రోజుల తరువాత బయటకు తీసి అధికారులు శవపంచనామా, పోస్టుమార్టం నిర్వహించారు. వివరాల్లోకి వెళితే ప్రత్తిపాడు పంచాయతీ పరిధిలోని తూర్పుపాలెంకు చెందిన ధూపాటి శివయ్య ఈ నెల 27న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. అతని బంధువులు 28న అదే గ్రామంలో ఖననం చేశారు. ఖననం చేసిన తరువాత అతని భార్య ముత్తమ్మ తన భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కేసు నమోదు చేసిన తరువాత కచ్చితంగా పోస్టుమార్టం చేయాల్సిల్సి ఉండటంతో మంగళవారం సాయంత్రం శివయ్య మృతదేహాన్ని పోలీస్, రెవెన్యూ అధికారుల సమక్షంలో బయటకు తీశారు. తొలుత రెవెన్యూ అధికారులు శవ పంచనామా నిర్వహించారు. అనంతరం ఫోరెన్సిక్ గుంటూరు మెడికల్ కళాశాల ఫోరెన్సిక్ మెడిసిన్ అండ్ సైన్స్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ జాఫర్ హుస్సేన్ పోస్టుమార్టం చేశారు. తహశీల్దార్ కె. రవిబాబు, ఇన్‌చార్జి ఎస్ఐ రవీంద్రలు మృతుని భార్యను విచారించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

మానవ అక్రమ రవాణాదారులను శిక్షించాలి

బాపట్ల టౌన్: మానవ అక్రమ రవాణా చేసే వారిని కఠినంగా శిక్షించాలని డీసీపీవో పసుమర్తి పురుషోత్తం తెలిపారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం మహిళా శిశు సంక్షేమ శాఖ, సొసైటీ ఫర్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్మెంట్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీసీపీవో పసుమర్తి పురుషోత్తం మాట్లాడుతూ.. అక్రమ రవాణాలో పసి పిల్లలను, మహిళలను ఎక్కువగా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని పేర్కొన్నారు. దీనిని నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సిఫార్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ కోఆర్డినేటర్ బడుగు కిషోర్ మాట్లాడుతూ.. అందరూ కలిసికట్టుగా పోరాడి ఈ అక్రమ రవాణాను నిర్మూలించాలన్నారు. అంగన్వాడీ సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు పట్టణంలోని పాతబస్టాండ్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీప్రియ, పారా లీగల్ వలంటీర్ శామ్యూల్ జాన్సన్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అమరావతి స్థూపాన్ని ప్రపంచ వారసత్వ కట్టడంగా గుర్తించాలి

అమరావతి: ఎంతో పురాతనమైన అమరావతి స్థూపాన్ని ప్రపంచ వారసత్వ కట్టడంగా గుర్తించాలని యునెస్కో వరల్డ్ హెరిటేజ్ కమిటీ 46వ సమావేశంలో కోరామని అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు అన్నారు. మంగళవారం ఢిల్లీలో జరిగిన యునెస్కో వరల్డ్ హెరిటేజ్ కమిటీ 46వ సమావేశంలో పాల్గొన్న అనంతరం ఆయన ఫోన్‌లో సమావేశ వివరాలను తెలియజేశారు. రాష్ట్రంలోని గండికోట, అమరావతి, నాగార్జునకొండ, సాలిహుండం, శంకరంలలోని కట్టడాలు, స్థూపాలకు ప్రపంచ వారసత్వ కట్టడాల హోదా ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న చారిత్రక కట్టడాలు, స్మారకాల చరిత్ర అపూర్వమని తెలియజేశామని తెలిపారు. శిల్పకళకు, వర్ణచిత్రాలకు నిలయమైన లేపాక్షిని యునెస్కో ప్రపంచ వారసత్వ కట్టడంగా తాత్కాలిక జాబితాలో మాత్రమే చేర్చిందన్నారు. శాశ్వత జాబితాలో చోటు దక్కే విధంగా కొన్ని సమస్యలను అధిగమించి యునెస్కో నియమ నిబంధన ప్రకారం నివేదిక తయారుచేసి పంపటానికి కృషి చేయాలన్నారు. జూలై 21వ తేదీన ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా భారతమండపంలో ప్రారంభమైన ఈ సమావేశంలో 165 దేశాల నుంచి 3000 మంది ప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు. ఈ సమావేశాలు ఈ నెల 31వ తేదీ వరకు నిర్వహిస్తారన్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలోని 129 కట్టడాలలో ఒక్క దానిని కూడా యునెస్కో ఫైనల్ జాబితాలో చోటు లేకపోవటాన్ని సమావేశం దృష్టికి తెచ్చామన్నారు. భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే విలువైన శిల్పకళ, కుడ్య చిత్రాలకు నిలయమైన లేపాక్షిని ప్రపంచ వారసత్వ కట్టడంగా శాశ్వత జాబితాలో చేర్చాలని వివరించామన్నారు. యునెస్కో తాత్కాలిక జాబితాలోకి ఎంతో ఘన చరిత్ర ఉన్న అమరావతి, నాగార్జునకొండ, గండికోట, సాలిహుండం, శంకరం ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని సమావేశంలో కోరామన్నారు. ఈసమావేశాలలో తెలుగు రాష్ట్రాల నుంచి స్తపతి ప్లీచ్ ఇండియా సీఈఓ, పురావస్తు పరిశోధకుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి పాల్గొన్నారని తెలిపారు.



సమావేశంలో డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి తదితరులు

పారిశుద్ధ్య కమాండ్ కంట్రోల్ రూం తనిఖీ

గుంటూరు ఎడ్యుకేషన్: గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహించేందుకు గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి ఆదేశాలతో ప్రారంభమైన కమాండ్ కంట్రోల్ రూమ్‌కు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల నుంచి పారిశుద్ధ్యంపై వచ్చే ఫిర్యాదులను స్వీకరించి, ఎంపీడీఓ, తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లాలని సిబ్బందికి సూచించారు. కమాండ్ కంట్రోల్ రూమ్ ఆగస్టు 10 వరకు పని చేస్తుందని తెలిపారు. మంగళవారం సాయంత్రం వరకు వచ్చిన ఫిర్యాదులు నమోదు చేసిన రిజిస్టర్లను జెడ్పీ చైర్‌పర్సన్ పరిశీలించారు.